ఎవరు పసివాళ్లు?

శ్రీ వి. వి. యస్. రామదాసు

నా ప్రేమగురించి చెప్పానుకదా. ఇంక మీ ప్రేమ గాథ చెప్పండి, త్యాగరాజుగారూ'అని తన భర్త శివాజీఅన్న మాటలకు కార్నరుసీటులో కూర్చుని కునికిపాట్లుపడుతున్న నలభైఏళ్ల అంబ ఉలిక్కిపడింది.

హైదరాబాదు - తిరుపతిబస్సు వేగంగా చీకటిని దూసుకునిపోతోంది.

ఆమె కూర్చున్నది వెనుకవరుసలోఉన్న మూల సీటు కావడంవల్ల బస్సులోఉన్న ప్రయాణీకులందరినీ ఆమె సునాయాసంగా చూడగలుగుతోంది.

రకరకాల సంభాషణలూ, పిల్లల ఏడ్పులూ ఆమెకు ఒకప్రక్కనుంచి ముంచుకువస్తున్న నిద్రను దూరంచేస్తున్నప్పటికీ ఆమె కునికిపాట్లుపడుతూనే ఉంది.

మధ్యాహ్నం అంతా

'ఈసారి తప్పకుండా జాక్‌పాట్ గెలిచి తీరుతాను'అనే ధోరణిలో సాగే సంభాషణా,

'ఎప్పటికయినా ఆ అమ్మాయినే పెండ్లాడుతాను'అనే తరహాలో సాగే మాటలూ,

'రాబోయే ఎన్నికలలో నన్ను నిలబడమని ప్రజలు బలవంతపెడుతున్నారు. ఈసారి గెలవడం ఖాయం'అనే బాణీలోసాగే సంభాషణా,

'మంత్రివర్గ విస్తరణలో ఛాన్సు కాస్తలో తప్పింది. మన గ్రూప్‌కిచెందిన ఆయన ముఖ్యమంత్రికాగానే మనకు మంత్రిపదవి యివ్వకతప్పదు' అనే ధోరణిలోసాగే సంభాషణా,

'రమ్మీ ఆటయొక్క రమ్యం ఆడినవాడికే తెలుస్తుంది. ఏమయినా వచ్చిన నష్టాన్ని పూడ్చుకుని, పైన లాభం సంపాదించి దానితోనే కూతురి పెళ్లి చేయాలి'అనే పంథాలో నడిచే సంభాషణా,

'తప్పత్రాగినవాడే తగు మనిషి'అనే ధోరణిలో రకరకాల మద్యాలను వివరిస్తూసాగే సంభాషణా,

'ఏమయినా యింక కొన్నినెలల్లో నాకు గెజిటెడ్ ఆఫీసరు ప్రమోషన్ రాకతప్పదు'అనే ధోరణిలో జరిగే సంభాషణా,

ఒకవంక వినివిని ఆమెకు విసుగెత్తింది.

మధ్యాహ్నంఅంతా మరొకవంక

'ఇప్పుడు నాకు జిలేబీ కావాలీ'అని మారాం చేసే వాడొక పిల్లవాడయితే

'నన్ను అమ్మమ్మ దగ్గరకు దిగబెట్టెయ్యి.' అని పేచీ పెట్టే పిల్ల మరొకత్తె.

'ఇవ్వాళ రాత్రి మనం తప్పకుండా సినిమాకి వెళ్లాలి.' అని కోరే గొంతెమ్మ పిల్లఒకత్తైతే

'ఐస్ క్రీం కొంటావా, కొనవా' అని మంకుపట్టు పట్టినవాడు మరొకడు.

'ఈ బొమ్మకు చెయ్యి విరిగింది. దానిని అతికించిపెట్టాలి' అని శతంచేసే పిల్ల ఒకత్తైతే,

'ఈ విరిగిన చెరుకు ముక్కలు నాకొద్దు. మళ్లీ వాటిని కర్రగా అతికించు' అని గోల పెట్టే పిల్లవాడు మరొకడు.

ఈ విధముగా పిల్లల ఏడ్పులతో, పేచీలతో, చికాకు కలుగుతున్నది మరొకవంక.

కర్నూలులో ప్రయాణీకులు భోజనాలు చేసిన తరువాత బస్సు బయలుదేరింది. కాసేపటికి చాలమంది పిల్లలు తల్లుల ఒడులలో నిదుర పోయారు. కాని పెద్దవాళ్లు నిద్రపట్టక మళ్లీ బాతాఖానీ మొదలుపెట్టారు.

వాళ్ల సంభాషణాసంగీతానికి శ్రుతి అన్నట్లు ఒక పిల్లవాడు ఏదో పేచీ పెడుతూ చిన్న స్థాయిలో ఏడుస్తూనే ఉన్నాడు.

పెద్దవాళ్లు ఎవరి ధోరణిలో వారు కబుర్లు చెప్పుకుంటున్నారు.

అంబకు ఎదురుగా సీట్లలో నలుగురు ఇద్దరి కెదురుగా యిద్దరు కూర్చున్నారు వారిలో ఒకాయన అంబ భర్త శివాజీ. రెండో ఆయన త్యాగరాజు. అంబ యాభైయారేళ్ల త్యాగరాజును అతని గొంతునుబట్టి, ఆకారాన్నిబట్టి పోల్చుకోగలిగింది గాని, త్యాగరాజు ఆమెను పోల్చుకోలేకపోయాడు. దానికి కారణం ఆమె కాన్పులవల్ల లావెక్కి ఉండడమూ, మశూచికంవల్ల ముఖమంతా స్ఫోటకం మచ్చలు తయారవడమూను. తక్కిన ఇద్దరూ అంబకు అపరిచితులు.

వారు ఆ మాటా ఈ మాటా చెప్పుకుని చివరకు ఎంతో పరిచయంగల వారిలా వారి సంభాషణ ప్రేమ గాథలలోకి దిగింది. వాళ్లు నలుగురూ యాభై దాటినవారే. తీర్థయాత్రకు పోతున్నామనే ధ్యాసయినా లేకుండా వారు తమ గతజీవిత ప్రేమస్మృతులలో పడ్డారు ఎవరైనా వినేవారుంటే ఒక రకం ప్రేమికుడు ఎంతయినా కవిత్వం అల్లి చెప్పగలడని వారి సంభాషణ వింటూన్న అంబకి అర్థం అయింది.

మొదటి అపరిచితుడు తాను ఏ విధముగా ప్రేమించి తల్లిదండ్రుల్ని లెక్క చేయకుండా కట్నం లేకుండానే పెళ్లి చేసుకున్నాడో చెప్పాడు.

రెండవ అపరిచితుడు తాను ఏ విధముగా ప్రేమకోసం సంఘాన్నెదిరించి వర్ణాంతర వివాహం చేసుకున్నాడో చెప్పాడు.

మూడవ ప్రేమికుడు అంబ భర్త శివాజీ. శివాజీ చెబుతున్న ప్రేమకథ అంబకు తెలిసినదే. అందుచేత మగతమగతగా వస్తున్న నిద్రలో విన్నది. శివాజీ ఈ విధముగా ప్రారంభించాడు.

'నేను నా ప్రేయసిని ఒక పెళ్లివారి పందిట్లో చూశాను. మా బంధువుల యింట్లో పెళ్లి చూడడానికి నేను భీమునిపట్నం వెళ్లాను. అక్కడ ఒక సర్వాంగసుందరిని చూసి ప్రథమ క్షణంలోనే ప్రేమించాను.'

'ఆమెతో మాట్లాడారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'ఎలాగో వీలు చేసుకుని మాట్లాడాను. ఆమె నాతో నవ్వుతూ ఎంతో కలుపుగోరుగా మాట్లాడింది' అన్నాడు శివాజీ.

'ఆమె మిమ్మల్ని ప్రేమించిందో లేదో తెలుసుకున్నారా?' అన్నాడు రెండవ అపరిచితుడు.

'నేను ఆమెను సూటిగా అడగలేదుకాని ఆమె తలిదండ్రులెవరో తెలుసుకుని వారితో మాట్లాడవలసిందని మా తండ్రిగారితో చెప్పాను. మా నాన్నగారు మాట్లాడి మా యిద్దరికీ వివాహం జరిపారు.'

'మరి మిమ్మల్ని ఆమె ప్రేమిస్తున్నదో లేదో తరువాతనయినా తెలుసుకున్నారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'ఆడవాళ్లు ప్రేమగురించి స్పష్టంగా చెప్పరు. వాళ్ల ప్రవర్తనద్వారా మనం తెలుసుకోవాలి. ఆమె నాతో ఎప్పుడూ జగడం ఆడలేదు. మాకు ముగ్గురు మగపిల్లలూ ఒక ఆడపిల్లా కలిగారు'అని యింకా శివాజీ చెబుతున్న మాటలు వింటున్న అంబ చిరునవ్వు నవ్వుకుంది. 'మగవాళ్లు ఎంత అల్పసంతోషులు'అని తనలో అనుకుంది.

నిజం చెప్పాలంటే అంబకు వివాహం జరిగేనాటికి ఎవరినీ ప్రేమించలేదు. అయితే ఆమెకున్న నేర్పు అనండి లేక సహజమైనలజ్జవల్ల ననండి ఆమెకున్న భావాలను స్పష్టంగా చెప్పలేకపోయేది.

అంబ కాలేజీలో యింటర్మీడియేటు చదువు తున్న రోజులలో త్యాగరాజు అనే బి. ఎ. ఫైనలియరు స్టూడెంటు ఆమెను గాఢంగా ప్రేమించి ఆమె వెంబడి తిరిగేవాడు. నిజానికి అంబ అతనిని ప్రేమించలేదు. కాని అతని మనస్సును గాయ పరచడం యిష్టంలేక అతనితో మామూలుగా మాట్లాడుతూ అతనితో ఒకటిరెండుసార్లు కాఫీ హోటలుకికూడా వెళ్ళింది. అతడుకూడా ఎప్పుడూ తన ప్రేమను ఆమెతో చెప్పలేదు. ఆమెతో చెప్ప డానికి అతడు ధైర్యాన్ని కూడగొట్టుకునే లోపలనే అంబకు పెళ్ళయిపోయింది.

'నా ప్రేమగురించి చెప్పానుకదా. ఇంక మీ ప్రేమగాథ చెప్పండి, త్యాగరాజుగారూ' అని తన భర్త శివాజీఅన్న మాటలకు అంబ ఉలిక్కిపడింది. త్యాగరాజు ఏమిచెబుతాడోనని కుతూహలంతో వింటున్నది.

'నేను మీ అంతటి అదృష్టవంతుణ్ణికాను, శివాజీగారూ. మీరు ముగ్గురూ ఎంతో ధైర్యంగా మీరు ప్రేమించిన కన్యలను వివాహంఆడి సుఖంగా ఉన్నారు' అన్నాడు త్యాగరాజు.

'మీరు ప్రేమించిన ఆమెను వివాహం ఆడ కుండా దగా చేశారా!' అన్నాడు కోపంగా మొదటి అపరిచితుడు.

'నేను దగా చేసేవానిలా కనిపిస్తున్నానా?' అన్నాడు త్యాగరాజు.

'అయితే ఆ అమ్మాయే దగా చేసిం దంటారా?' అన్నాడు రెండవ అపరిచితుడు.

'ఆయన చెప్పేది ఏమిటో పూర్తిగా విన నీయండి' అన్నాడు శివాజీ.

'ఆమెను మనసారా ప్రేమిస్తున్న నేను ఆమెపై నిందవేయలేను. అసలు ఏమి జరిగిందంటే నేను బి. ఏ. ఫైనలియరు చదువుతూ ఉండగా ఒకమ్మాయి ఇంటర్మీడియేటు జూనియరులో చేరింది. ఆమె ఎంతో చక్కగా ఉండేది. ఆమెను చూడగానే నేనామెను ప్రేమించాను.'

'ఆమెతో ఆ విషయం ఎప్పుడయినా చెప్పారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'క్రమేపీ చెప్పాలనే అభిప్రాయంతో మొదట ఆమెతో స్నేహం చేయాలని ప్రయత్నం చేశాను.'

'ఆమె మీతో సుముఖంగా మాట్లాడేదా?' అన్నాడు రెండవ అపరిచితుడు.

'ఆమె నాతో ఎప్పుడూ సౌమ్యంగానే మాట్లాడేది. ఒక్కొక్కప్పుడు నేను నర్మగర్భంగా మాట్లాడినప్పటికీ ఆమె ఏమీ ప్రకోపగించుకోలేదు. రెండుసార్లు నాతో కాఫీ హోటలుకికూడా వచ్చింది.'

'ఆమె మిమ్మల్ని ప్రేమిస్తున్నది అంటారా?' అన్నాడు శివాజీ.

'మీరు యిందాక చెప్పినట్లు ఆడవాళ్ళు తమ ప్రేమ విషయం స్పష్టంగా చెప్పరుకదా. నేను ఎప్పుడూ ఆమెను అడగలేదు. ఆమె ప్రవర్తనను బట్టి ఆమె నన్ను ప్రేమిస్తున్నదనే క్రమంగా నా ప్రేమను ఆమెకు తెలిపి వివాహానికి ఒప్పించా లనీ అనుకుంటూ ఉండగా ఆమె సగంలోనే చదువు మానేసింది.'

'ఎందుచేత?' అన్నాడు మొదటి అపరి చితుడు.

ఆమెకు వివాహం జరిగిపోయింది. అందుచేత కాలేజీ మానేసింది.' అన్నాడు త్యాగరాజు బరువుగా.

'మరి మీరు మళ్ళీ ఆమెను చూడాలని ప్రయత్నం చేయలేదా?' అన్నాడు శివాజీ.

'లేదు. నేను ఆమెను ప్రేమిస్తున్నాను

కాబట్టే చూడాలని ప్రయత్నం చేయలేదు. పండంటి ఆమె సంసారంమీద నా పరిచయచ్ఛాయల్ని వేసి పాడు చేయడానికి నా కిష్టం లేదు...

'అయితే ఆమెను మీరింక ప్రేమిస్తున్నారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'అవును...'

'మీరు వివాహితులై ఉండి, వివాహితురాలైన ఆమెను ఎట్లా యింకా ప్రేమిస్తున్నారు?' అన్నాడు శివాజీ.

'అక్కడే మీరు పొరబడుతున్నారు. నేను వివాహితుణ్ణి కాను.'

'ఏమిటీ? అసలు పెళ్లే చేసుకోలేదా? మీరెంత గొప్పవారు.'

'అందులో నా గొప్ప ఏమీ లేదు. ఆమెను ప్రేమించిన తరువాత నేను వేరే స్త్రీని ఆమె స్థానంలో ఉంచలేకపోయాను. అది నా బలహీనత.'

ఆ మాటలు వింటున్న అంబ కళ్లు చెమర్చాయి.

'అయితే కేవలం ప్రేమలోపడి దేశానికీ సమాజానికీ మీకున్న కర్తవ్యాన్ని నెరవేర్చడం మరిచిపోయారా?' అన్నాడు శివాజీ.

'కేవలం వివాహం చేసుకోవంత మాత్రాన దేశంపట్ల నాకున్న కర్తవ్యాన్ని నెరవేర్చలేనను కోకండి. నేను దేవదాసులాగా, మజ్నూలాగా జీవితాన్ని నాశనం చేసుకోలేదు. కష్టపడి చదివి ప్రభుత్వోద్యోగంలో ప్రవేశించి ఆఫీసరుగా పేరుపొంది ఈ సంవత్సరమే రిటైరయ్యాను.'

'మీరు మళ్లీ ఆమెను చూశారా?' అన్నాడు శివాజీ.

'లేదు. కాని రెండేళ్ల క్రితం సరిగా ఆమె పోలికే ఉన్న ఒక యువకుడు ఉద్యోగంకోసం నా వద్దకు యింటర్వ్యూకి వచ్చాడు. అతణ్ణి చూస్తున్నంతసేపూ ఆమెను చూస్తున్నట్లే భావించాను. 'మీ అమ్మగారిపేరు ఫలానా కాదా?' అని అడిగితే ఆ యువకుడు కోపగించి, 'మా అమ్మపేరుకీ నా ఉద్యోగానికీ సంబంధం ఏముంది?' అన్నాడు. 'కోపగించుకోకు నాయనా. ఫలానా పేరుగల అమ్మాయి నాతో చదివారు. నీ మొహం మీ అమ్మగారి పోలిక అనుకుని అడిగాను. నీ కిష్టం లేకపోతే చెప్పవద్దు. అంతమాత్రంచేత నీకు అన్యాయం జరగదు' అన్నాను. నేను సౌమ్యంగా చెప్పిన తీరు అతణి కదిలించి నట్లుంది. 'క్షమించండి సార్. అదే మా అమ్మ పేరు' అన్నాడు.'

'ఆ ఉద్యోగం ఆ అబ్బాయికి యిచ్చారా?' అన్నాడు మొదటి అపరిచితుడు.

'అవును, నా సర్వీసు అంతటిలోనూ నేను చూపించిన పక్షపాతం అది ఒకటే' అన్నాడు త్యాగరాజు.

ఆ మాటలు వింటున్న అంబ కంటివెంబడి కృతజ్ఞతాపూర్వకమైన కన్నీళ్లు రాలాయి.

'బాబుగాడికి ఉద్యోగం యిచ్చిన మహానుభావు డీయనన్న మాట. ఈ సంగతి వాడు నాకు చెప్ప లేదేం? ఆ ప్రసక్తి నాకు చెప్పవద్దని త్యాగరాజుగారు అని ఉంటారు' అనుకున్నది అంబ.

'ఇంతకూ ఆ పవిత్రురాలి పేరు తెలుసు కోవచ్చునా?' అన్నాడు శివాజీ.

త్యాగరాజు ఏమి చెబుతాడోనని పర్యవసానం ఏమవుతుందోనని అంబ ఊపిరి బిగబట్టుకుని వింటున్నది.

'నేను ఆమె పేరు ఎవరికీ చెప్పదలచుకో లేదు. ఎందుచేతనంటే ఆ విషయం నాకూ ఆ పరమాత్మునకీ మధ్య దాగి ఉండాలని నా అభిప్రాయం.' అన్నాడు త్యాగరాజు.

'అవునవును. మీరు ప్రేమిస్తున్నట్లు ఆమెకుకూడా తెలియదుకదా' అన్నాడు శివాజీ.

'ఇంతకాలం గడచినతరువాత ఇంకా ఆమెను ప్రేమిస్తున్నారా? ఇప్పుడు వెనుకకుతిరిగి చూసుకుంటే ఒక పొరపాటుచేశారని అనుకోవడంలేదా? ఏదో వెలితి కనిపించడంలేదా?' అని ప్రశ్నలవర్షం కురిపించాడు రెండవ అపరిచితుడు.

'నేను యింకా ఆమెను ప్రేమిస్తున్నాను. నా కండ్లముందు ఆమె చక్కనిరూపం ఎప్పుడూ ప్రత్యక్షంగా ఉంటుంది. ఇక వెలితి అంటారా? నాకేమీ కనిపించడంలేదు. బ్రతికిఉన్న రోజులంతా తీర్థయాత్రలు చేస్తూ, పుస్తకాలు చదువుతూ తేలికగా గడిపేస్తాను. నాకు ఒకటే కోరిక ఉంది' అన్నాడు త్యాగరాజు.

'ఏమిటది?' అన్నాడు శివాజీ.

ఏమిచెబుతాడోనని అంబకూడా వింటున్నది.

'ఆనాడు ఉద్యోగంకోసంవచ్చిన అబ్బాయితో స్నేహంచేసి అవసానదశలో నాకేమైనా ఆస్తి మిగిలితే అతనికిచ్చి అతనిచేతనే అంత్యక్రియలు జరిపించుకోవాలనిఉంది' అన్నాడు త్యాగరాజు.

అంబ కంటివెంట నీళ్లు అప్రయత్నంగా రాలాయి.

త్యాగరాజు చెప్పిన ప్రేమగాథ వినిన తరువాత ఎవరూ మాట్లాడలేకపోయారు.

అంబ బస్సులో కునికిపాట్లు పడుతున్న ప్రయాణీకులను పరిశీలించింది. ఒకపిల్లవాడు ఏదో మారాం చేస్తున్నాడు. వాడిని సముదాయించడానికి వాని తల్లి ప్రయత్నం చేస్తోంది,

'నా పాపాయికి జాగాలేదూ' అని రాగాలు తీస్తున్నాడు, నాలుగేళ్ల పిల్లవాడు.

'అసలు పాపాయి ఏదిరా కనిపించలేదేం?' అంటున్నది వాని తల్లి.

'ఇదేంటి. ఇక్కడ నిలిచిపోయింది, చూడు' అని ఖాళీప్రదేశాన్ని చూపిస్తున్నాడు.

ఆ తల్లికి కోపంవచ్చి కొట్టడానికి చేయి ఎత్తింది.

'ఆపమ్మా. ఆ పసివానిని కొట్టకండి' అని అంబ కేకవేసి, 'ఇలా రా నాయనా. నీ పాపాయికి నేను జాగా యిస్తాను' అన్నది. ఆ పిల్లవాడు సీట్లు పట్టుకుని రావడానికి ప్రయత్నంచేస్తూంటే వాని తల్లి వానిని ఎత్తుకుని అంబ ఉన్న సీటు వద్దకు వచ్చింది.

'నీ పాపాయికూడా వచ్చిందికదు బాబూ?' అన్నది అంబ.

'అవును మామ్మా. ఇదుగో చూడు. ఇక్కడే నుంచుంది' అన్నాడా పసివాడు ఉత్సాహంగా.

'అవును సుమా. అదుగో కనిపిస్తోంది. ఏమే పాపాయీ బాగున్నావా?' అని శూన్యాన్ని పలకరించింది. ఆ పసివానిముఖంమీద నవ్వులు నాట్యం చేశాయి.

ఆయుర్వేద భూషణ
పండిత నోరి రామశాస్త్రులవారి

*** క్షీరవర్ధని ***

చనుబాలను వృద్ధిచేయు రసాయనము. దీనిని వాడుటవలన చనుబాలు స్వచ్ఛమై సమృద్ధిగా పసిపాపకు సరిపోవునట్లుచేసి, తల్లిపిల్లల యారోగ్యమును కాపాడును.
వెల 100ml రు. 3/- : 200ml రు. 5/-

*** జీవనవటి ***

ధాతు పుష్టికి, నరముల పటుత్వమునకు ప్రసిద్ధి గాంచినది. శుక్లనష్టము, నపుంసకత్వము ఆవే పీడింపబడు వృద్ధులకు సైతము శక్తి నిచ్చి, ఓజస్సును వృద్ధి చేయును.
వెల 30 మాత్రలు రు. 6/-

మాచే దీర్ఘవ్యాధులకు పోస్టుద్వారాకూడ సలహా యిచ్చి, ప్రత్యేక చికిత్స చేయబడును. క్యాటలాగు, సలహా ఉచితము.
డాక్టరు నోరి వెంకటేశ్వరశాస్త్రి,
A.V.A.C., A.L.I.M.
చీఫ్ ఫిజిషియను. ఆయుర్వేద నిలయం,
పోస్టుబాక్సు 32, విజయవాడ-1. ఆంధ్రప్రదేశ్.

'మరేమో, నా పాపాయికి జాగా లేదంటున్నది అమ్మ. చూడు మామ్మా' అని ఫిర్యాదుచేశాడు ఆ పసివాడు.

'జాగా లేకేం బాబూ. ఇదిగో ఇక్కడ నేను జరుగుతున్నాను. ఇక్కడ పడుకోపెట్టు. నా ఒళ్లో నువ్వు పడుకుంటావా లేక మీ పాపాయిని పడుకోపెట్టుకోమంటావా?' అన్నది అంబ.

'ఇద్దరం పడుకుంటాము, మామ్మా.' అన్నాడు ఆ పసివాడు.

'అలాగే బాబూ. నువ్వు ఈ తొడమీద తలపెట్టుకుని పడుకో. పాపాయిని ఆ తొడమీద పడుకోపెట్టు' అనగానే ఉత్తుత్త పాపాయిని అంబ తొడమీద పడుకోపెట్టి ఆ పసివాడు అంబ ఒడిలో తలదూర్చి పడుకున్నాడు.

'నా దగ్గర ఉండనీయండి,' అని అంబ చెప్పగానే థాంక్సుచెప్పి ఆ తల్లి తన సీటు దగ్గరకు పోయింది.

'పాపం, పసివాడు' అన్నాడు త్యాగరాజు.

'అవును పాపం, పసివాడు' అన్నారు తక్కిన ముగ్గురూ.

అంబకు నవ్వు వచ్చింది.

ఎదురుగా తాను ప్రేమించిన స్త్రీ ఉన్నప్పటికీ కాలం ఆమెలో తెచ్చిన భౌతికమైన మార్పు తెరను తొలగించి అసలు స్వరూపాన్ని చూడలేని త్యాగరాజూ, తాను ప్రేమించి వివాహం చేసుకున్న స్త్రీ తనను ప్రేమిస్తున్నదో లేదో స్థిరిగా తెలుసుకోకుండా ఊహా ప్రపంచంలో ఉంటున్న తన భర్త శివాజీ, ప్రేమ వివాహాలు చేసుకొని సుఖిస్తున్నామని యితరులను నమ్మించడానికి ప్రయత్నం చేసిన యిద్దరు అపరిచితులూ, తాము ఏదో సాధించి తీరుతామని కలలు కంటున్న రకరకాల పెద్దమనుష్యులూ, ఏవేవో కావాలని, ఏవేవో ఉన్నాయని ఊహించి సంతోషిస్తున్న పసివాళ్లూ అంబ దృష్టిలో ఒక మాదిరిగనే కనిపించారు.

'ఎవరు పసివాళ్లు?' అని అంబ తన మనస్సులో ప్రశ్నించుకుని చిరునవ్వు నవ్వింది.

బస్సు శరవేగంతో చీకటిని దూసుకుని పోతోంది.